## టాయిలెట్‌కు వెళ్లొచ్చిన ప్రతిసారీ..
# తనిఖీ, బయోమెట్రిక్ తప్పనిసరి

**జేఈఈ మెయిన్ నిర్వహణపై ఎన్టీఏ.. త్వరలో ఇతర పరీక్షలకూ అమలు**



న్యూఢిల్లీ, జనవరి 3: జేఈఈ మెయిన్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల తనిఖీ, బయోమెట్రిక్ హాజరు విషయంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ కీలక నిర్ణయం తీసుకొన్నది. పరీక్ష రాసే సమయంలో టాయిలెట్ బ్రేక్‌కు వెళ్లి వచ్చిన ప్రతిసారి కూడా అభ్యర్థిని తనిఖీ చేయడం, బయోమెట్రిక్ హాజరు వేయడం తప్పనిసరిగా ఉంటుందని ఎన్టీఏ అధికారులు వెల్లడించారు. అధికారులు, అబ్జర్వర్లు, సిబ్బంది, ఇతర సహాయకులకు కూడా ఇదే ప్రక్రియ ఉంటుందని పేర్కొన్నారు. పరీక్షలో అక్రమాలు జరుగకుండా చూడటం, అభ్యర్థి స్థానంలో మరో వ్యక్తి పరీక్ష రాయడం వంటి కేసులు చోటుచేసుకోకుండా నిరోధించేందుకు ఈ నిర్ణయం తీసుకొన్నట్టు ఎన్టీఏ డైరెక్టర్ సుబోధ్ కుమార్ సింగ్ వెల్లడించారు. ఈ విధమైన ప్రక్రియను రాబోవు కాలంలో ఇతర పరీక్షలకు కూడా విస్తరిస్తామని తెలిపారు. ప్రస్తుతం అమలవుతున్న పరీక్ష విధానం ప్రకారం.. అభ్యర్థులను ఎంట్రీ అప్పుడు తనిఖీ చేయడం జరుగుతుంది. అక్కడే బయోమెట్రిక్ హాజరు కూడా తీసుకొంటారు. ఉన్నత విద్యా సంస్థల్లో ఇంజినీరింగ్ విద్య ప్రవేశాలకు సంబంధించిన జేఈఈ(మెయిన్) పరీక్షను ఈ ఏడాది తెలుగు, ఇంగ్లిష సహా 13 భాషల్లో నిర్వహిస్తున్నారు. మొదటి సెషన్‌లో భాగంగా జనవరి 24 నుంచి ఫిబ్రవరి 1 వరకు ఆన్‌లైన్ విధానంలో పరీక్ష నిర్వహిస్తారు. ఫలితాలు ఫిబ్రవరి 12న విడుదల అవుతాయి. అదే విధంగా రెండో సెషన్ పరీక్ష ఏప్రిల్‌లో ఉంటుంది. అదే నెల 25న ఫలితాలు విడుదల చేస్తారు.

## ఈడీ విచారణకు కేజ్రీవాల్ మళ్లీ గైర్హాజరు

- రాజ్యసభ ఎన్నికలు, రిపబ్లిక్ వేడుకల ఏర్పాట్లలో బిజీగా ఉన్నట్టు వెల్లడి
- ప్రశ్నలు పంపితే సమాధానాలిస్తానని లేఖ



న్యూఢిల్లీ, జనవరి 3: ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఈడీ ముందు హాజరు కావడానికి ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ మరోసారి నిరాకరించారు. ఇప్పటికే ఈ కేసులో ఈడీ రెండుసార్లు జారీ చేసిన నోటీసులను ఆయన లెక్క చేయలేదు. తాజాగా మూడోసారి జారీ చేసిన సమన్లపై స్పందిస్తూ దర్యాప్తు సంస్థకు లేఖ రాశారు. రాబోయే రాజ్యసభ ఎన్నికల్లో తలమునకలై ఉన్నానని, రిపబ్లిక్ డే వేడుకల సందర్భంగా అనేక ముఖ్య కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉన్నందున ఈడీ విచారణకు రాలేనని, ఈడీ తాను అడగాల్సిన ప్రశ్నలను పంపితే సమాధానం ఇవ్వడానికి గానీ, అవసరమైన పత్రాలు సమర్పించడానికి గాని తాను సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు. అసలు తనను విచారణకు పిలవడానికి నిజమైన కారణం, పరిధి, స్వభావం, ఉద్దేశం తెలియజేయాలంటూ గతంలో రాసిన లేఖలపై దర్యాప్తు సంస్థ స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. దీనిపై ఈడీ మౌనం చూస్తుంటే ఏదో అవాంఛనీయ రహస్యాన్ని దాయడమే కాక, అపారదర్శకంగా, పక్షపాతంతో ఉన్నట్టు అనుమానాలు కలిగిస్తున్నాయన్నారు.

## జార్ఖండ్ సీఎం సలహాదారు ఇంటిపై ఈడీ దాడులు

రాంచీ, జనవరి 3: జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్ ప్రెస్ అడ్వైజర్, మాజీ ఎంఎల్ఏ, కొందరు జిల్లా అధికారుల ఇళ్లపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాడులు నిర్వహించింది. అక్రమ మైనింగ్ కేసులో మనీ లాండరింగ్‌కు పాల్పడ్డారన్న ఆరోపణలతో సీఎం సలహాదారు అభిషేక్ ప్రసాద్ అలియాస్ పింటూ, సాహిబ్ గంజ్ జిల్లా కలెక్టర్, మాజీ ఎంఎల్ఏ పప్పు యాదవ్ మరి కొందరు ఇళ్లపై రాజధాని రాంచీ, రాజస్థాన్‌లో ఈడీ అధికారులు బుధవారం సోదాలు నిర్వహించారు. సొరేన్ ప్రభుత్వాన్ని గద్దె దించే కుట్రలో భాగంగా ఈడీ ద్వారా బీజేపీ ఈ దాడులు చేయిస్తున్నదని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత సుబోధ్ కాంత్ యాదవ్ సహాయ్ ఆరోపించారు.

# ఇరాన్‌లో మారణకాండ

## జనరల్ సులేమాని స్మారక కార్యక్రమంలో నిమిషాల వ్యవధిలో బాంబు పేలుళ్లు

**103 మంది మృతి.. 188 మందికి గాయాలు**

టెహ్రాన్/దుబాయ్, జనవరి 3: ఇరాన్‌లో బాంబుల మోత మోగింది. ఆ దేశానికి చెందిన ప్రముఖ సైనికాధికారి జనరల్ ఖాసీం సులేమాని స్మారక కార్యక్రమం బుధవారం జరుగుతున్న వేళ నిమిషాల వ్యవధిలో గుర్తు తెలియని వ్యక్తులు జంట పేలుళ్లకు పాల్పడ్డారు. ఈ ఘటనలో 103 మంది మరణించగా, 188 మందికి గాయాలయ్యాయని ఇరాన్ అధికారులు వెల్లడించారు. సులేమాని నాలుగో వర్ధంతి సందర్భంగా కెర్మాన్ పట్టణంలోని ఓ శ్మశానంలో ఉన్న ఆయన సమాధి వద్ద నివాళులర్పించేందుకు వందలాది మంది ప్రజలు అక్కడకు చేరుకొన్నారు. ఈ స్మారక కార్యక్రమం జరుగుతున్న సమయంలో దాదాపు 20 నిమిషాల వ్యవధిలో రెండు పేలుళ్లు జరిగాయని అధికారులు తెలిపారు. గాజా స్ట్రిప్‌లోని హమాస్‌పై ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో ఇప్పటికే పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. గాజాపై ఇజ్రాయెల్ సైన్యం దాడులను ఇరాన్ తీవ్రంగా వ్యతిరేకిస్తూ వస్తున్నది. ఈ నేపథ్యంలో ఇరాన్‌లో జరిగిన తాజా వరుస పేలుళ్ల ఘటన సంచలనం రేపింది. అయితే ఈ దాడులకు బాధ్యత వహిస్తున్నట్టు ఇప్పటి వరకు ఏ ఉగ్రవాద లేదా ఇతర సంస్థ ఏదీ ప్రకటించలేదు.

బాంబు దాడులను ఉగ్రదాడిగా కెర్మాన్ డిప్యూటీ గవర్నర్ రెహ్మాన్ జలాలి పేర్కొన్నారు. అయితే దీని వెనుక ఎవరు ఉన్నారో ఆయన చెప్పలేదు. స్మారక కార్యక్రమానికి వందలాది సంఖ్యలో వచ్చిన వాళ్లు క్యూలలో నిలబడిన సమయంలో వరుస బాంబు దాడులకు పాల్పడ్డారు. మొదట బాంబు మధ్యాహ్నం 3 గంటల సమయంలో పేలిందని, 20 నిమిషాల తర్వాత మరో బాంబును ఆపరేట్ చేశారని అంతర్గత వ్యవహారాల శాఖ మంత్రి అహ్మద్ వాహిది వెల్లడించారు. రెండో పేలుడు ఘటనలోనే ఎక్కువ మంది మరణించారని, గాయపడ్డారని తెలిపారు. మొదటి బాంబు దాడి తర్వాత రెస్క్యూ చర్యలు చేపట్టిన ఎమర్జెన్సీ సిబ్బంది లక్ష్యంగా రెండో బాంబు దాడికి పాల్పడినట్టు అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఇరాన్ లక్ష్యంగా జరిగిన ఈ తీవ్రవాద దాడిని 1979 ఇస్లామిక్ రెవల్యూషన్ తర్వాత పెద్ద దాడిగా చెబుతున్నారు.



జంట పేలుళ్ల ధాటికి దెబ్బతిన్న కార్లు

### ఇంటా బయటా శత్రుత్వం

ఇరాన్ ఇంటా బయటా పలు బహిష్కరణ గ్రూపులు, తీవ్రవాద సంస్థల నుంచి శత్రుత్వాన్ని ఎదుర్కొంటున్నది. అణు కార్యక్రమాల నిర్వహణ నేపథ్యంలో ఇరాన్‌లో ఇజ్రాయెల్ దాడులు చేపట్టింది. అయితే సామూహిక బాంబు దాడులుగా కాకుండా లక్షిత హత్యలుగా జరిగాయి. ఇక ఇస్లామిక్ స్టేట్ గ్రూపు సహా సున్నీ తీవ్రవాద గ్రూపులు గతంలో షియా మెజార్టీగా ఉండే ఇరాన్‌లో పెద్దయెత్తున దాడులకు పాల్పడ్డాయి. 2022లో 22 ఏండ్ల మహ్సా అమిని హత్యకు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలతో పాటు గత కొన్నేండ్లుగా ఇరాన్‌లో వివిధ అంశాలపై పెద్దయెత్తున నిరసన కార్యక్రమాలు జరుగుతున్నాయి. కాగా, గాజాలోని హమాస్, లెబనాన్‌కు చెందిన హెజ్బొల్లా, యెమెన్‌లోని హౌతీలకు దశాబ్దాలుగా ఆయుధాలు అందజేస్తున్న దేశంగా ఇరాన్ ఉన్నది.



### ఎవరీ ఖాసిం సులేమాని?

ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్‌లోని అత్యంత శక్తివంతమైన ఖుద్స్ ఫోర్స్‌కు నాయకత్వం వహించిన ఖాసీం సులేమాని.. 2020, జనవరి 3న అమెరికా డ్రోన్ దాడిలో మరణించాడు. అప్పటి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆదేశాలతో ఇరాక్ రాజధాని బాగ్దాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయంలో ఈ దాడి జరిగింది. ఇరాన్ సైనిక కార్యకలాపాల రూపకర్తగా సులేమాని పేరుపొందాడు. 2003లో ఇరాక్‌పై అమెరికా దాడి వరకూ పెద్దగా బయటి ప్రపంచానికి తెలియని ఆయన.. అనంతర కాలంలో జాతీయ ఐకాన్‌గా మారాడు. దశాబ్దన్నర కాలంలో సులేమాన్ ఇరాన్ గొప్ప యుద్ధభూమి కమాండర్‌గా గుర్తింపు పొందాడు. రోడ్డు పక్కన బాంబులు అమర్చి, అమెరికా దళాలను మట్టుబెట్టడంలో తీవ్రవాదులకు ఆయుధ సాయం చేసిన సులేమాని హత్యకు అమెరికా అధికారులు పిలుపునిచ్చిన తర్వాత ఆయన పాపులారిటీ పెరిగింది.



### ఇండియా కూటమి కన్వీనర్‌గా నితీశ్?

న్యూఢిల్లీ, జనవరి 3: బీహార్ ముఖ్యమంత్రి, జేడీ(యూ) అధినేత నితీశ్‌కుమార్‌ను ఇండియా కూటమి కన్వీనర్‌గా నియమించే అవకాశం ఉన్నది. అయితే, ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించాల్సి ఉన్నది. గత వారం బీహార్ సీఎంను జేడీ(యూ) చీఫ్‌గా ఎన్నుకున్నారు. ఇండియా కూటమి కన్వీనర్‌గా నితీశ్‌కుమార్‌ను ఎంపిక చేయడం వ్యూహాత్మక నిర్ణయమని పార్టీ నేత లలన్‌సింగ్ అభిప్రాయపడ్డారు. ఇండియా కూటమి అధికారంలోకి తెచ్చేందుకు అవసరమైన చర్చలు, వ్యూహాలు రచించడంతో ఆయన అనుభవం, చతురత ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.



### ఇప్పట్లో ఇంధన ధరలు తగ్గించం: కేంద్ర మంత్రి

న్యూఢిల్లీ, జనవరి 3: పెట్రోల్, డీజిల్ ధరలు ఇప్పట్లో తగ్గే సూచనలు కనిపించడం లేదు. అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినప్పటికీ.. ప్రస్తుతం ప్రపంచ ఆయిల్ మార్కెట్ దుర్భర పరిస్థితిని ఎదుర్కొంటున్నదని పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పురి చెప్పారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'పెట్రోల్, డీజిల్ ధరల తగ్గుదలపై ఆయిల్ కంపెనీలతో ఇప్పటివరకు చర్చించలేదు. ప్రస్తుతం అంతర్జాతీయంగా జరుగుతున్న రెండు యుద్ధాలు (రష్యా-ఉక్రెయిన్, ఇజ్రాయెల్-హమాస్), ఎర్ర సముద్రంలో నౌకలపై దాడి తదితర పరిణామాలు కూడా పెట్రోల్, డీజిల్‌పై ప్రభావం చూపనున్నాయి. పరిస్థితులు సద్దుమణిగితే ఇంధన ధరలు తగ్గింపు ఉంటుంది' అని పేర్కొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులు కోర్టులకు భౌతికంగా హాజరుకానక్కర్లేదు

- ఉద్యోగులను కించపరిచేలా వ్యాఖ్యలు చేయొద్దు
- కింది న్యాయస్థానాలకు సుప్రీంకోర్టు సూచన
- అధికారులకు సమన్ల జారీపై మార్గదర్శకాలు విడుదల



న్యూఢిల్లీ, జనవరి 3: సాక్ష్యాల నమోదుతో కూడిన న్యాయపరమైన విచారణలో తప్ప ప్రభుత్వ అధికారులు భౌతికంగా న్యాయస్థానాలకు హాజరుకానక్కర్లేదని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ప్రభుత్వ అధికారులను కోర్టులకు పిలిపించటం, వస్త్రధారణపై వ్యాఖ్యలు చేయటంపై సుప్రీం కోర్టు కీలక మార్గదర్శకాలు జారీ చేసింది. అధికారులను కించపరిచేలా మాట్లాడటం, వారి వేషధారణపై వ్యాఖ్యలు చేసే విషయంలో జాగ్రత్తగా ఉండాలని కింది కోర్టులను హెచ్చరించింది. కోర్టు ముందు హాజరు కావాలని జారీ చేసే సమన్ల విషయంలోనూ మార్గదర్శకాలు పాటించాలని 'స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్'ను బుధవారం విడుదల చేసింది. ఏకపక్షంగా కోర్టులకు పిలిపించటంలో ప్రభుత్వ అధికారులకు మినహాయింపు ఇవ్వాలని చీఫ్ జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్థివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం తేల్చి చెప్పింది. మార్గదర్శకాలను దేశంలోని అన్ని కోర్టులు తప్పనిసరిగా అనుసరించాలని ఆదేశించింది. అధికారుల వస్త్రధారణపై వ్యాఖ్యలు చేయొద్దని, కోర్టు కార్యాలయంలో దుస్తుల కోడ్‌ను ఉల్లంఘిస్తే తప్ప వారి వస్త్రధారణను కించపరిచేలా వ్యాఖ్యానించొద్దని స్పష్టం చేసింది. గత ఏడాది ఇద్దరు సీనియర్ అధికారులు హాజరు కావాలని అలహాబాద్ హైకోర్టు సమన్లు జారీ చేసింది. దీన్ని యూపీ ప్రభుత్వం సవాలు చేసింది. దీనిపై కోర్టు విచారణ జరిపింది. ప్రభుత్వ అధికారులను తరచూ కోర్టులకు పిలిస్తే ప్రజలకు అందించే సేవలకు ఇబ్బందులు తలెత్తుతాయని ధర్మాసనం అభిప్రాయపడింది. అఫిడవిట్ల ద్వారా సమస్యలను పరిష్కరించే విషయాన్ని ఆలోచించాలని కోర్టులకు సూచించింది.

### కేజ్రీవాల్ అయినా, సొరేన్ అయినా ఊచలు లెక్కించాల్సిందే: బీజేపీ

న్యూఢిల్లీ, జనవరి 3: దేశాన్ని దోచుకుంటున్న ప్రతి అవినీతి నేత తాము చేసిన తప్పులకు శిక్ష అనుభవించక తప్పదని, అవినీతికి పాల్పడితే కేజ్రీవాల్ అయినా, సొరేన్ అయినా ఊచలు లెక్కించాల్సిందేనని బీజేపీ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా బుధవారం స్పష్టం చేశారు. కేజ్రీవాల్, సొరేన్ ఈడీ విచారణకు హాజరుకాకపోవడాన్ని ఆయన తప్పుబట్టారు. రాజకీయ ప్రేరేపితంగా తనకు ఈడీ నోటీసులు జారీ చేస్తున్నట్టు ఆరోపిస్తున్న కేజ్రీవాల్ ఈ విషయంలో ఎందుకు న్యాయస్థానాలను ఆశ్రయించడం లేదని ప్రశ్నించారు.

### రైల్వే సేవలన్నీ ఒకే యాప్‌లో

- 'సూపర్‌యాప్'ను అభివృద్ధి చేస్తున్న సీఆర్ఐఎస్

హైదరాబాద్, జనవరి 3 (నమస్తే తెలంగాణ): రైలు టికెట్ల బుకింగ్, రైళ్ల ట్రాకింగ్, ఫుడ్ డెలివరీ లాంటి సేవలన్నింటినీ ఒకేచోట అందించేందుకు ఇండియన్ రైల్వే ఓ 'సూపర్ యాప్'ను రూపొందించే పనిలో నిమగ్నమైంది. ప్రస్తుతం రిజర్వేషన్ టికెట్ల బుకింగ్‌కు 'రైల్ కనెక్ట్' యాప్, జనరల్ టికెట్లను కొనుగోలు చేసేందుకు 'యూటీఎస్' యాప్, ఫిర్యాదులు స్వీకరించేందుకు 'రైల్ మదద్' యాప్, రైళ్ల ట్రాకింగ్‌కు 'ఎన్‌టీఈఎస్' యాప్ అందుబాటులో ఉండటంతో ప్రయాణికులకు తీవ్రమైన ఇబ్బంది కలుగుతున్నది. ఈ నేపథ్యంలో ఈ సేవలన్నింటినీ ఒకే వేదికపైకి తెచ్చేందుకు భారతీయ రైల్వే సిద్ధమవుతున్నది. అందులో భాగంగా ఓ సూపర్ యాప్‌ను రూపొందిస్తున్నది. ఇండియన్ రైల్వేకు సంబంధించిన అన్ని రకాల సేవలను ఒకే చోట అందించడం ఈ సూపర్ యాప్ ముఖ్య ఉద్దేశం. ఇందుకోసం రైల్వే శాఖ ఏకంగా రూ.90 కోట్లు వరకు వెచ్చించనున్నట్టు సమాచారం. సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (సీఆర్ఐఎస్) ఈ సూపర్ యాప్‌ను అభివృద్ధి చేస్తున్నట్టు రైల్వే శాఖ వెల్లడించింది. ఇది అందుబాటులోకి వస్తే రైలు ప్రయాణికులు వేర్వేరు యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాల్సిన అవసరం ఉండదు. రైల్వే సేవలన్నీ సూపర్ యాప్‌లోనే లభిస్తాయి.

## డెవలపర్‌తోపాటు భూ యజమానిదీ
# సమాన బాధ్యత

- ఇండ్ల నిర్మాణం ఆలస్యమైతే ఇద్దరూ పరిహారం చెల్లించాలి
- జాతీయ వినియోగదారుల కమిషన్ కీలక తీర్పు



న్యూఢిల్లీ, జనవరి 3: గృహ నిర్మాణ ప్రాజెక్టులు ఆలస్యమైనప్పుడు ఇండ్ల కొనుగోలుదారులకు డెవలపర్లతోపాటు భూమి యజమానులు కూడా పరిహారం చెల్లించాల్సిందేనని జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కారాల కమిషన్ (ఎన్సీడీఆర్సీ) స్పష్టం చేసింది. ఈ తీర్పుతో ఇండ్ల కొనుగోలుదారులకు తాము కోల్పోయిన సొమ్మును తిరిగి రాబట్టుకోవడమే కాకుండా పరిహారం కూడా పొందే అవకాశం కలిగింది. భాగస్వామ్య వెంచర్లలో ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు డెవలపర్లతో పాటు భూమి యజమానులు కూడా సమాన బాధ్యులేనని ఎన్సీడీఆర్సీ పేర్కొంది. డెవలపర్ పారిపోయినా లేక దివాలా తీసినప్పటికీ ఇండ్ల కొనుగోలుదారులకు ఈ తీర్పుతో లబ్ధి చేకూరుతుందని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. బెంగళూరుకు చెందిన యూనిషైర్ హోమ్స్ ఎల్ఎల్‌పీ సంస్థ 2017 నాటికి ఇండ్ల నిర్మాణాన్ని పూర్తిచేసి కొనుగోలుదారులకు హస్తగతం చేయాలి. ఉత్తర బెంగళూరులో 2012లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టులో ఇండ్ల కోసం కొనుగోలుదారులు రూ.1లక్ష నుంచి రూ.8 లక్షల వరకు చెల్లించారు. కానీ డెవలపర్లు అనుకున్న సమయానికి ఇండ్ల నిర్మాణాన్ని పూర్తి చేయలేకపోయారు. దీంతో 10 మంది కొనుగోలుదారులు ఎన్సీడీఆర్సీని ఆశ్రయించారు. ఇండ్ల నిర్మాణం దాదాపు ఆరేండ్లు ఆలస్యమైందని పేర్కొన్న కమిషన్ కొనుగోలుదారులకు ఆరు శాతం చొప్పున వడ్డీ చెల్లించాలని డెవలపర్‌ను ఆదేశించింది. ఈ తీర్పును సమీక్షించాలని కోరుతూ వినియోగదారులు మరోసారి రివ్యూ పిటిషన్ వేశారు. దీనిపై విచారణ జరిపిన ఎన్సీడీఆర్సీ.. ఇండ్ల నిర్మాణం ఆలస్యం కావడానికి డెవలపర్‌తోపాటు ప్రాజెక్టులో భాగస్వాములైన భూమి యజమానులు కూడా బాధ్యులేనని తేల్చింది. కర్ణాటక రేరా 2019 డిసెంబర్‌లో జారీచేసిన ఒక సర్క్యులర్‌లో.. రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుల్లో లాభాలు పంచుకొనే భూ యజమానులను కూడా ప్రమోటర్లుగానే పరిగణించాలని తెలిపింది. భూయజమాని పొందే లాభాల వాటాను తెలుపుతూ డెవలపర్ సదరు ప్రాజెక్టును రిజిస్టర్ చేయాలని పేర్కొంది. 'పలు ప్రాజెక్టుల్లో డెవలపర్లు ఒక కంపెనీని ఏర్పాటుచేసి భూ యజమానులతో డెవలప్‌మెంట్ ఒప్పందం చేసుకుంటారు. కొనుగోలుదారుల నుంచి వారే అడ్వాన్స్‌లు లేదా పూర్తి మొత్తం డబ్బు వసూలు చేసుకుంటారు. అనూహ్య పరిస్థితుల్లో ప్రాజెక్టు ఆలస్యమైనప్పుడు లేదా మోసం చేయాలనుకున్నప్పుడు వారు అదృశ్యమైపోతుంటారు. భూమి భూ యజమాని వద్దనే ఉంటుంది, డెవలపర్ కొనుగోలుదార్ల డబ్బుతో ఉడాయిస్తాడు. మధ్యలో మోసపోయేది కొనుగోలుదారులే' అని కర్ణాటక హోం బయ్యర్స్ ఫోరం కన్వీనర్ ధనంజయ పద్మనాభాచార్ వివరించారు. ఈ నేపథ్యంలో భూ యజమానులను కూడా బాధ్యులను చేయాలని కొనుగోలుదారుల పక్షం న్యాయవాది కమిషన్ ముందు వాదించారు. ఈ వాదనతో ఏకీభవించిన ఎన్సీడీఆర్సీ.. గృహ నిర్మాణ ప్రాజెక్టులను పూర్తి చేయడంలో డెవలపర్‌తో పాటు భూ యజమానులు కూడా సమాన బాధ్యత వహించాలని తీర్పు చెప్పింది.

# సిట్, సీబీఐతో దర్యాప్తు అక్కర్లేదు

- అదానీపై సెబీ దర్యాప్తు చాలు
- సెబీ వ్యవహారాల్లో కోర్టు జోక్యం పరిమితం
- అదానీ షేర్ల మ్యానిప్యులేషన్ ఆరోపణలపై సుప్రీంకోర్టు
- 3 నెలల్లో దర్యాప్తు పూర్తి చేయాలని సెబీకి ఆదేశం





న్యూఢిల్లీ, జనవరి 3: అదానీ గ్రూప్ షేర్ల ధరల అవకతవకల ఆరోపణలపై సిట్ లేదా సీబీఐతో దర్యాప్తు జరిపించాలన్న విజ్ఞప్తిని సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఈ అంశంపై సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) దర్యాప్తు విశ్వసనీయంగానే ఉన్నదని, వేరే దర్యాప్తు అవసరం లేదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల ధర్మాసనం బుధవారం స్పష్టంచేసింది. అదానీ షేర్ల ధరల నిర్ణయంలో అవకతవకలకు పాల్పడిందని అమెరికాకు చెందిన షార్ట్ సెల్లింగ్ సంస్థ హిండెన్‌బర్గ్ ఆరోపించటంతో దేశంలో తీవ్ర దుమారం రేగిన విషయం తెలిసిందే. ఈ అంశంపై సెబీ దర్యాప్తు జరిపి కొన్ని అంశాల్లో అదానీ గ్రూప్‌నకు క్లీన్‌చిట్ ఇచ్చింది. మరికొన్ని ఆరోపణలపై దర్యాప్తు కొనసాగుతున్నది. సుప్రీంకోర్టు నియమించిన నిపుణుల కమిటీ కూడా అదానీ గ్రూప్‌లో అక్రమాలు జరిగినట్టు ఆధారాలు లభించలేదని తేల్చింది. అయితే, అదానీ గ్రూప్ షేర్లలో అక్రమాలు జరిగాయని మీడియాలో వచ్చిన కథనాలను ఆధారం చేసుకొని సుప్రీంకోర్టులో కొందరు పిటిషన్లు వేశారు. వీటిని విచారించిన కోర్టు బుధవారం వాటిని కొట్టివేసింది. 'వార్తా పత్రికలు, థర్డ్‌పార్టీ నివేదికల ఆధారంగా సెబీని ప్రశ్నించలేం. వాటిని ఇన్‌పుట్స్‌గా పరిగణించవచ్చు. సెబీ దర్యాప్తును అనుమానించడానికి అవి ఆధారాలు కావు' కోర్టు వ్యాఖ్యానించింది.

### మా అధికారం పరిమితమే

సెబీ వంటి చట్టబద్ధమైన సంస్థ అధికారాల్లో జోక్యం చేసుకోవటానికి కోర్టుకు పరిమితంగానే అధికారాలు ఉన్నాయని సుప్రీంకోర్టు తెలిపింది. పార్లమెంటులో 'డెలిగేటెడ్ లెజిస్లేషన్' ద్వారా ఏర్పడిన సెబీ విషయంలో అపరిమితంగా జోక్యం చేసుకోలేమని తేల్చి చెప్పింది. అదానీ గ్రూప్‌పై వచ్చిన 24 ఆరోపణల్లో ఇప్పటికే 22 అంశాలపై సెబీ విచారణ పూర్తిచేసిందని తెలిపింది. మిగతా అంశాలపై కూడా మూడు నెలల్లో దర్యాప్తు పూర్తిచేయాలని సెబీని ఆదేశించింది. సుప్రీం తీర్పుపై అదానీ గ్రూప్ అధినేత గౌతం అదానీ సంతోషం వ్యక్తంచేశారు. 'చివరకు సత్యమే గెలిచింది' అని ట్వీట్ చేశారు.

### అశ్రిత పక్షపాతంపై పోరాడుతాం: కాంగ్రెస్

న్యూఢిల్లీ, జనవరి 3: అదానీ గ్రూపు అక్రమాల ఆరోపణలపై సుప్రీంకోర్టు బుధవారం ఇచ్చిన తీర్పుపై కాంగ్రెస్ అసంతృప్తి వ్యక్తం చేసింది. తీర్పు సెబీ పట్ల అసాధారణమైన ఉదారత ప్రదర్శించినట్టుగా ఉన్నదని వ్యాఖ్యానించింది. అశ్రిత పక్షపాతంతో పాటు ధరలు, ఉపాధి, అసమానతలపై దాని ప్రతికూల ప్రభావంపై తమ పార్టీ పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నది. ఈ మేరకు కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఓ ప్రకటన విడుదల చేశారు. అదానీ గ్రూపు సెక్యూరిటీ చట్టాల ఉల్లంఘన, స్టాక్ మ్యానిప్యులేషన్ ఆరోపణలపై సకాలంలో దర్యాప్తు చేయడంలో సెబీ విఫలమైందన్నారు. దర్యాప్తును పూర్తి చేయడానికి సెబీకి మరో మూడు నెలల సమయం ఇవ్వడంపై అభ్యంతరం వ్యక్తం చేసిన జైరాం రమేశ్.. సెబీ పట్ల సుప్రీంకోర్టు ఉదారంగా ఉందన్నారు. తీర్పు అనంతరం అదానీ సత్యమేవ జయతే అని వ్యాఖ్యానించడంపై రమేశ్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. గత దశాబ్దకాలంగా వ్యవస్థను దుర్వినియోగం చేస్తూ మ్యానిపులేషన్‌కు పాల్పడిన వారు సత్యమేవజయతే అని పలికితే సత్యం వెయ్యిసార్లు చచ్చిపోతుందని వ్యాఖ్యానించారు. అదానీ అక్రమాలను సెబీ చూసీ చూడనట్టు వ్యవహరించిందని, వీటిని మీడియా బయటపెట్టినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు.

# అమెరికా అప్పు 2,832 లక్షల కోట్లు

**దేశ చరిత్రలోనే తొలిసారిగా దుర్భర పరిస్థితి**

**ఒక్కో పౌరుడి నెత్తిపై రూ. 83 లక్షల భారం**

**కరోనా సంక్షోభం, ద్రవ్యోల్బణమే కారణం**

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జనవరి 3 (నమస్తే తెలంగాణ): అగ్రరాజ్యం అమెరికా అప్పుల ఊబిలో కూరుకుపోయింది. గత డిసెంబర్ 29 నాటికి దేశ రుణాలు 34 ట్రిలియన్ డాలర్లకు (రూ. 2,832 లక్షల కోట్లు) చేరాయి. ఈ లెక్కన ఒక్కో అమెరికన్ నెత్తిపై లక్ష డాలర్లు (రూ. 83 లక్షలు) అప్పు ఉన్నట్టు తేలింది. ఈ మేరకు అమెరికా ట్రెజరీ డిపార్ట్‌మెంట్ తాజా నివేదికలో వెల్లడించింది. బడ్జెట్ లోటు కూడా గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగిపోయినట్టు వివరించింది. నిజానికి అమెరికా అప్పులు 2029 సంవత్సరానికి ఈ స్థాయికి చేరుకొంటాయని అంచనా వేశారు. అయితే 2019-20లో కరోనా సృష్టించిన సంక్షోభం, అనంతరం విధించిన లాక్‌డౌన్ కారణంగా వర్తక, వాణిజ్య సముదాయాలు మూతబడి ఆర్థిక వ్యవస్థ కుదేలైంది. కొవిడ్ కల్లోలం ముగియగానే ముసురుకొన్న ఆర్థిక మాంద్యం భయాలు, ద్రవ్యోల్బణ పరిస్థితులు.. వెరసి అమెరికాను అప్పుల కుప్పగా మార్చాయి.

### ప్రభావమైతే ఉండకపోవచ్చు

సర్కారు పాలసీలకు అనుగుణంగా ప్రభుత్వానికి అప్పునిచ్చే సంస్థలు ఉన్నాయని, దీంతో ఈ అప్పుల భారం అమెరికా ఆర్థిక వ్యవస్థపై ఇప్పటికిప్పుడు అంతగా ప్రభావం చూపకపోవచ్చునని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దీంతో ప్రజలపై పన్నుల భారం మోపకుండానే సామాజిక సంక్షేమం, వైద్య కార్యక్రమాలను కొనసాగించడానికి ప్రభుత్వానికి వెసులుబాటు లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా, రానున్న అధ్యక్ష ఎన్నికల్లో రుణాల అంశం కీలక భూమిక పోషించబోతుండటంతో.. సంపన్నులు, కార్పొరేట్లపై పన్నులు విధించి అప్పుల నుంచి బయటపడాలని బైడెన్ ప్రభుత్వం యోచిస్తున్నది. ఇందులో భాగంగా పన్నుల వసూళ్లలో కీలకమైన ఇంటర్నల్ రెవెన్యూ సర్వీస్ (ఐఆర్ఎస్)కు బడ్జెట్ కేటాయింపులను పెంచింది. అయితే, రక్షణేతర రంగాలకు బడ్జెట్ కేటాయింపులను తగ్గించడం ద్వారా రుణభారాన్ని తగ్గించుకోవాలని రిపబ్లికన్ చట్టసభ సభ్యులు పట్టుబడుతున్నారు. ప్రజలపై పన్నుభారాన్ని మోపవద్దని, ఐఆర్ఎస్ కేటాయింపులను తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.



**అమెరికా ఆర్థిక వ్యవస్థ ఇలా..**

| దేశ జీడీపీ | అప్పు | జీడీపీ-అప్పు నిష్పత్తి | జనాభా |
|---|---|---|---|
| 26.5 ట్రిలియన్ డాలర్లు | 34 ట్రిలియన్ డాలర్లు | 128.3 శాతం | 34 కోట్లు |

ఒక్కో పౌరుడి నెత్తిపై అప్పు: లక్ష డాలర్లు